

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 22-05-2025 | సంపుటి - 24 | సంచిక - 20 | రూ : 4 | పేజీలు: 8


## భారత్ బయోటెక్ కలరా టీకా హిల్‌కాల్

- నోటి ద్వారా తీసుకునే వీలు
- క్లినికల్ పరీక్షల్లో విజయవంతం
- 20 కోట్ల డోసుల ఉత్పత్తికి సన్నాహాలు

**మే 21, హైదరాబాద్:** భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన కలరా టీకా 'హిల్‌కాల్' మూడో దశ క్లినికల్ పరీక్షల్లో విజయవంతమైంది. కలరా వ్యాధికి కారణమయ్యే ఒగావా,

తరువాయి 2లో




## మావోయిస్టు... దళపతి ఎన్‌కౌంటర్





2లో

- కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతి
- అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆయన సహా 27 మంది మృత్యువాత
- అగ్రనేతలు ఉన్నారన్న సమాచారంతో ఈ నెల 19 నుంచే కూంబింగ్
- అతిపెద్ద విజయమన్న ప్రధాని మోదీ

## అన్నదాతకు వానకాటు

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- పిడుగుపాటుకు నలుగురి మృతి
- వచ్చే నాలుగు రోజులూ వర్షా లు

**మే 21, హైదరాబాద్, నిర్మల్, నర్సంపేట:** రాష్ట్రంలో బుధవారం పలు జిల్లాల్లో వర్షాలు, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పిడుగులు పడిన ఘటనల్లో మొత్తం నలుగురు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లాల్లో ఇద్దరు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో ఒక్కొక్కరు చనిపోయారు. సూర్యాపేట జిల్లా నల్లబండగూడెం వద్ద పిడుగుపాటుకు 39 మేకలు మృత్యువాత పడ్డాయి. హైదరాబాద్ నగరంతో పాటు ఆదిలాబాద్, జగిత్యాల,

తరువాయి 2లో



# బహుముఖ దార్శనికుడు రాజీవ్ గాంధీ

- దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రాణాలర్పించారు
- భారత్.. ట్రంప్‌నకు లొంగిపోయి యుద్ధం విరమించుకుందనే భావన ప్రజల్లో ఉంది
- రాజీవ్ సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మే 21, హైదరాబాద్:** 'భారతదేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన బహుముఖ దార్శనికుడు రాజీవ్‌గాంధీ.. దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రాణాలర్పించిన గొప్ప నాయకుడు.. అందుకే ఆయన వర్ధంతి నాడు నివాళిగా అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని పాటిస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ''సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి తీసుకువచ్చిన మార్గదర్శకుడు, ఆర్థిక సరళీకృత విధానాలను అమలు చేసిన స్ఫూర్తిదాయక నాయకుడు రాజీవ్ గాంధీయే. దేశ భవిష్యత్‌ను నిర్దేశించడంలో యువత పాత్ర కీలకమని ముందే ఊహించిన ఆయన.. ఓటు హక్కు పొందే వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన విగ్రహాన్ని సచివాలయం ఎదురుగా ఏర్పాటుచేస్తే సంకుచిత భావాలున్న కొందరు నాయకులు రాద్ధాంతం చేస్తున్నారు. అటు అమరవీరుల సంస్మరణ వేదిక, ఇటు ఇందిరా గాంధీ,

తరువాయి 2లో






## పాఠశాల సిలబస్‌లో యోగాను చేరుస్తాం

- కనీవినీ ఎరుగని విధంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- నెల రోజులపాటు 'యోగాంధ్ర' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు
- రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా ఏర్పాట్లు
- జూన్ 21న విశాఖపట్నంలో 5 లక్షల మందితో భారీగా కార్యక్రమం

### ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**మే 21, అమరావతి:** రానున్న రోజుల్లో రాష్ట్రంలో యోగాను పాఠశాలల సిలబస్‌లో చేరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న పదకొండో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామన్నారు. యోగాంధ్ర2025 పేరుతో బుధవారం (మే 21) నుంచి నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని, జూన్ 21న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే కార్యక్రమాన్ని ఐదు లక్షల మందితో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ వన్ ఎర్త్.. వన్ హెల్త్' నినాదంతో.. ఇప్పటి వరకు నమోదైన అన్ని రికార్డులనూ బద్దలు కొడుతూ అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆ రోజున

తరువాయి 2లో

## కుంకీలు వచ్చేస్తున్నాయ్...



- ఏనుగులను అప్పగించిన కర్ణాటక
- బదిలీ ఆదేశ పత్రాలు అందుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2లో

## భారత్‌కు గగనతలం మూసివేత..

- మరో నెల పొడిగించనున్న పాక్!

**మే 21:** భారత్‌పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ విమానాలకు పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని మరో నెలపాటు పొడిగించేందుకు దాయాది దేశం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ నిషేధానికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో పాక్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ (ICAO) నిబంధనల ప్రకారం.. గగనతల ఆంక్షలు ఒకేసారి ఒక నెల కంటే

తరువాయి 2లో



# మావోయిస్టు దళపతి ఎన్‌కౌంటర్..

హైదరాబాద్: భారత విప్లవోద్యమ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్ (70) ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. నాలుగున్నర దశాబ్దాలకు పైగా నక్సల్స్ ఉద్యమంలో కొనసాగి చివరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అడవుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాశారు. ఈ స్థాయి నేత ఎన్‌కౌంటర్‌లో మరణించడం ఇదే తొలిసారి. ఈ ఘటనలో మొత్తం 27 మంది మావోయిస్టులు, ఓ జవాన్ మృతి చెందారు. మావోయిస్టు పత్రిక 'అవామ్‌ఇ జంగ్' ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు సజ్జ వెంకటనాగేశ్వరరావు ఎలియాస్ నవీన్ (61), మావోయిస్టు కంపెనీ కాయ్7 కమాండర్ టిప్పు.. మృతుల్లో ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటించారు. మిగతా మృతుల వివరాలు వెల్లడికాలేదు. కేశవరావును అంతమొందించడం మావోయిస్టులపై అతిపెద్ద విజయమని ప్రధాని మోదీ ప్రకటించారు.

**విశ్వసనీయ సమాచారంతో**

నారాయణపూర్, బీజాపూర్, దంతెవాడ సరిహద్దుల్లోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో అగ్రనేతలతో పాటు, మాడ్ డివిజన్, పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ)కి చెందిన సీనియర్ కేడర్ ఉన్నారని నిఘావర్గాలకు కీలక సమాచారం అందడంతో గత సోమవారమే ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. నారాయణపూర్, దంతెవాడ, బీజాపూర్, కొండగావ్ జిల్లాల నుంచి డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బలగాలు ఆ ప్రాంతంలోని అడవుల్ని జల్లెడ పడుతూ ముందుకుసాగాయి. అక్కడి భౌగోళిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ.. కేశవరావు ఉన్నారనే విశ్వసనీయ సమాచారంతో సవాళ్లను ఎదుర్కొంటూ ఆపరేషన్ కొనసాగించాయి. బుధవారం ఉదయం సమయంలో ఒర్చా పోలీస్ స్టేషన్ పరిధి జాట్లూరు అటవీ ప్రాంతంలో బలగాలకు మావోయిస్టులు తారసపడడంతో గంటలపాటు ఎదురు కాల్పులు కొనసాగాయి. ఎన్‌కౌంటర్‌లో ఒక డీఆర్జీ జవాన్ మృతి చెందగా.. మరికొందరికి గాయాలయ్యాయి. మావోయిస్టుల వైపు నుంచి కాల్పుల శబ్దం ఆగిన తర్వాత ఘటనాస్థలికి వెళ్లి చూడగా 27 మృతదేహాలు లభ్యమైనట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు వెల్లడించారు. ఆ ప్రాంతంలో ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, కార్బైన్ ఆయుధాలతోపాటు పేలుడు సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన జవానుతో పాటు మావోయిస్టుల మృతదేహాలను నారాయణపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ ఆపరేషన్ పెద్ద విజయంగా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి, హోంమంత్రి విజయశర్మ అభివర్ణించారు. ఎన్‌కౌంటర్‌లో మరికొందరు మావోయిస్టు అగ్రనేతలు గాయపడి ఉంటారని.. వారి జాడ కోసం పరిసర ప్రాంత అడవుల్లో కూంబింగ్ కొనసాగుతోందని వెల్లడించారు.

*** ఆపరేషన్ బ్లాక్‌ఫారెస్ట్ ముగించిన వెంటనే..**

ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీసుస్టేషన్ పరిధిలోని కర్రెగుట్టల్లో కేంద్ర బలగాలు ఇటీవలే భారీఎత్తున 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు'ను చేపట్టిన సంగతి తెలిసిందే. కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఆనవాళ్లు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 22న ప్రారంభమైన ఆపరేషన్ 24 రోజులపాటు కొనసాగింది. ఇందులో 31 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు హతమార్చాయి. పలు బంకర్లను ధ్వంసం చేశాయి. 54 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా... 84 మంది లొంగిపోయారు. అలా కర్రెగుట్టల్లో ఆపరేషన్ ముగించిన వెంటనే ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతా బలగాలు ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర సరిహద్దులోని నేషనల్‌పార్క్ ఏరియాపై దృష్టిసారించాయి. మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధానకార్యదర్శిగా ఉన్న కేశవరావు మరణించడంతో ప్రస్తుతం ఆ పార్టీ చుక్కాని లేని నావలా మారింది

*** మన బలగాలను చూసి గర్విస్తున్నా: ప్రధాని మోదీ**

నంబాల కేశవరావు సహా 27 మంది దళ సభ్యుల మృతిపై ప్రధాని మోదీ బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను చూసి గర్విస్తున్నా. మావోయిస్టుల ముప్పును నిర్మూలించి..ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు.

# అన్నదాతకు వానకాటు

(మొదటిపేజీ తరువాయి)

జనగామ, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, కుమురం భీం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్ కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వనపర్తి, భువనగిరి జిల్లాల్లో వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లో విస్తారంగా వానలు పడటంతో వీధులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మార్కెట్ యార్డులు, కల్లాల్లోని ధాన్యం తడిసి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. రోడ్లపై, కల్లాల్లో ఆరబోసినవి కొట్టుకుపోయాయి. వరంగల్ జిల్లా నర్సంపేట, ఖానాపురం మండలాల్లో 20 టన్నులకుపైగా ధాన్యం తడిసింది. సూర్యాపేట జిల్లాలోనూ భారీగా నీటిపాలైంది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం, తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉంచిందీ తడిసిపోయింది. సారంగాపూర్ మండలం ఆలూర్‌లో తూకం వేసి తరలించడానికి సిద్ధం చేసిన బస్తాలపై కప్పడానికి కవర్లు అందుబాటులో లేక చీరలు కప్పారు. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. తరలించడానికి సిద్ధంగా ఉంచిన బస్తాల్లోకి నీరు చేరింది. వరదలో వడ్లు కొట్టుకుపోయాయి. సకాలంలో కాంటాలు వేయకపోవడం.. లారీల కొరతతో మిల్లులకు ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

**నేడు పలు జిల్లాల్లో...**

గురువారం నుంచి ఆదివారం వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి, మేడ్చల్ మల్కాజిగిరి, కామారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడతాయని తెలిపింది. ఈమేరకు ఆయా జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది.

# పాఠశాల సిలబస్‌లో యోగాను చేరుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

విశాఖలోని సాగర తీరంలో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు లక్షల మంది యోగాసనాలు వేస్తారన్నారు. సముద్ర తీరంలో లక్షల మంది పాల్గొనేలా యోగా చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారని, అరుదైన ఘటనగా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన తెలిపారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా ప్రపంచ రికార్డులను నమోదు చేసే అన్ని సంస్థలనూ ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు తెలిపారు. దేశంలోని ప్రముఖ యోగా, ఆధ్యాత్మిక గురువులను ఆ కార్యక్రమానికి తానే స్వయంగా ఆహ్వానిస్తానన్నారు. ఆ రోజున విశాఖ సాగరతీరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో కనీసం 2 కోట్ల మందిని భాగస్వాముల్ని చేయనున్నట్టు తెలిపారు. 'యోగా డే'లో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకునేందుకు రూపొందించిన యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు పాల్గొన్నారు.

**10 లక్షల మందికి శిక్షణ**

ఈ నెల రోజుల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణ కోర్సుల ద్వారా 10 లక్షల మందికి యోగాలో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. "యోగా డే' రోజున రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, విద్యా సంస్థల్లో జరిగే కార్యక్రమాలకు వారు నాయకత్వం వహిస్తారు. నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పాటలు, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహిస్తాం. వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విశాఖలో జరిగే కార్యక్రమంలో భాగస్వాముల్ని చేస్తాం. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా వంటి సంస్థల సేవలను వినియోగించుకుంటాం. వేసవి సెలవులు ముగిశాక జూన్ 21 వరకు పాఠశాలల్లో ఉదయం గంట సేపు యోగా తరగతులు బోధించాలి. రాబోయే రోజుల్లో యోగాను సిలబస్‌లో భాగంగా చేస్తాం. రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక యోగా కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. పెద్ద పెద్ద హోటళ్లలో కూడా యోగా, ధ్యానం కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తాం. యోగాకు సంబంధించి పాఠ్యపుస్తకాలు, పాటలు, వీడియోలు రూపొందించి ప్రజలకు అందజేస్తాం. యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీల స్థాయి నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులను భాగస్వాముల్ని చేస్తున్నాం. రాష్ట్రస్థాయిలో మంత్రులతో కమిటీని ఏర్పాటు చేశామ'ని సీఎం వివరించారు.

## భారత్‌కు గగనతలం మూసివేత.. మరో నెల పొడిగించనున్న పాక్!

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువ కాలం విధించేందుకు వీలులేదు. పాకిస్థాన్ గత నెల విధించిన నిషేధం మే 23 వరకు అమల్లో ఉంటుంది. ఆలోపు మరో నెలపాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇలా భారత విమానాలకు గగనతల ఆంక్షలను పాకిస్థాన్ గతంలోనూ విధించింది. 1999 కార్గిల్ యుద్ధం సమయంలో, 2019 పుల్వామా ఘటన తదనంతర ఉద్రిక్త పరిస్థితుల్లోనూ ఈ ఆంక్షలు కొనసాగాయి. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దాయాది దేశంపై ప్రతీకార చర్యలకు భారత్ ఉపక్రమించింది. ఇందులో భాగంగా సింధూ నదీ జలాల ఒప్పందం అమలు నిలిపివేతతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్‌ను విడిచి వెళ్లాలని ఆదేశించింది. అనంతరం ఆ దేశ విమానాలు భారత్ గగనతలంపై ప్రయాణించకుండా ఆంక్షలు విధించింది.



## బలోచిస్థాన్‌లో పేలుడు..
## పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

బలోచిస్థాన్‌లో పాఠశాల బస్సు లక్ష్యంగా జరిగిన ఆత్మాహుతి దాడిలో పలువురు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. సొంత వైఫల్యాల నుంచి ప్రపంచ దృష్టిని మరల్చే ప్రయత్నంలో భాగంగా ఈ ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది. అంతేకాకుండా స్థానిక సమస్యలకూ భారత్‌ను నిందించడం దాయాది దేశానికి అలవాటుగా మారిందని మండిపడింది. "ఖుజ్దార్‌లో చోటుచేసుకున్న దాడిలో భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నాం. అటువంటి ఘటనల్లో మరణించిన వారికి భారత్ సంతాపం తెలిపింది. అయినప్పటికీ.. సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంతోపాటు ఉగ్రవాదానికి అంతర్జాతీయ కేంద్రంగా పేరుగాంచిన వారు, ప్రపంచ దృష్టి మరల్చేందుకు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారు. వారి



అంతర్గతంగా ఉన్న అన్ని సమస్యలకు భారత్‌ను నిందించడం పాక్‌కు పరిపాటిగా మారింది" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచాన్ని మోసగించేందుకు పాక్ చేస్తున్న ఈ తరహా ప్రయత్నాలు విఫలం అవుతున్నాయని అన్నారు. బలోచిస్థాన్‌లోని ఖుజ్దార్ ప్రావిన్స్‌లో ఓ పాఠశాల బస్సును లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. 38 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## బహుముఖ దార్శనికుడు రాజీవ్ గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

పీవీ నరసింహారావు విగ్రహాలు, నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహమున్న ఈ ప్రాంతంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఉండటం సముచితం. పార్టీలకు అతీతంగా ఆయనకు నివాళులర్పించాల్సి ఉంది" అని అన్నారు.

*** మేం తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నప్పుడు కిషన్‌రెడ్డి ఇంట్లో నిద్రపోతున్నారు**

"పహల్గాంలో ఉగ్రవాద దాడికి బదులుగా భారత జవాన్లు సరిహద్దుల్లో పోరాడుతుంటే వారికి మద్దతుగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడింది. నాలుగుకోట్ల ప్రజల తరఫున త్రివర్ణ పతాకం చేతబూని తిరంగా ర్యాలీని నిర్వహించాం. ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి మద్దతుగా నిలబడ్డాం. దేశ సమగ్రతను కాపాడుతున్న కేంద్ర ప్రభుత్వానికి బాసటగా మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మాట్లాడారు. వీటిని విస్మరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. రాహుల్ గాంధీని నిందిస్తున్నారు. మేం తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నప్పుడు కిషన్‌రెడ్డి ఇంట్లో దుప్పటి కప్పుకొని నిద్రపోతున్నారు. రాష్ట్రం మొత్తం జవాన్లకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తే అభినందించేందుకు ఆయనకు నోరు రాలేదు.. పైగా దూషణలకు దిగుతున్నారు. పాకిస్థాన్‌ను ఓడిస్తే ప్రపంచమంతా మీకు (కేంద్రానికి) ఆహ్వానం పలుకుతుంది. ఇందుకు భిన్నంగా మీరు గొప్పలు చెప్పుకొనేందుకు పార్టీ శ్రేణులను రోడ్లపై తిప్పుతున్నారు. భాజపా నాయకులు గొప్పవాళ్లో... కాదో ప్రజలు నిర్ణయిస్తారు. ఇప్పటికైనా ఉగ్రమూకలను ఏరివేయండి. ఉగ్రవాదం పీచమణచండి.. పార్టీలకు అతీతంగా మీకు అండగా ఉంటాం.

*** ప్రజలంతా ఉక్కు మహిళ ఇందిరను స్మరించుకున్నారు**

పహల్గాం దాడి అనంతర ఘటనల సందర్భంగా ప్రజలంతా ఉక్కు మహిళ ఇందిరా గాంధీని స్మరించుకున్నారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గకుండా నాడు పాకిస్థాన్‌ను నిట్టనిలువునా చీల్చేసి బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమై... పాకిస్థాన్‌కు శాశ్వత గుణపాఠం నేర్పారని గుర్తు తెచ్చుకున్నారు. అమెరికా అధ్యక్షుడి మాటలను లెక్కచేయకుండా నిటారుగా నిలబడిన ఆమె ధైర్యాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు" అని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మక్కాన్‌సింగ్ ఠాకూర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, రాష్ట్ర పరిశీలకుడు విశ్వనాథ్, మాజీ ఎంపీ వీహెచ్, మేయర్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## భారత్ బయోటెక్ కలరా టీకా హిల్‌కాల్

(మొదటిపేజీ తరువాయి)

ఇనబా సెరోటైప్ రెండింటిపైనా ఇది సమర్థంగా పనిచేస్తున్నట్లు నిర్ధారణ అయింది. తద్వారా పెద్దలు, పిల్లలను కలరా వ్యాధి నుంచి కాపాడే అవకాశం లభిస్తుంది. 'హిల్‌కాల్' అనేది నోటి ద్వారా తీసుకునే కలరా టీకా (ఓసీవీ ఓరల్ కలరా వ్యాక్సిన్) కావడం మరో ప్రత్యేకత. ఈ టీకాపై నిర్వహించిన మూడో దశ క్లినికల్ పరీక్షల ఫలితాలను సైన్స్ డైరెక్ట్‌కు చెందిన వ్యాక్సిన్ జర్నల్ ప్రచురించింది. దేశంలోని 10 ప్రాంతాల్లో పెద్దలు, పిల్లలు కలిపి 1800 మందిపై ఈ టీకా పరీక్షలు నిర్వహించారు. టీకా తీసుకున్న వారిలో రోగ నిరోధక శక్తి పెరిగింది. వారిలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కానందున, ఈ టీకా భద్రమైందని తేలింది. ఈ సమాచారాన్ని నియంత్రణ సంస్థలకు అందించి, తుది అనుమతులు పొందాక విపణిలోకి విడుదల చేస్తారు.

**వర్ధమాన దేశాలకూ మేలు**

కలరా వ్యాధిని టీకా ద్వారా అదుపు చేయొచ్చని, కానీ టీకా తగినంతగా అందుబాటులో లేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్ల అన్నారు. నోటి ద్వారా తీసుకునే టీకా అయిన హిల్‌కాల్‌తో ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధించొచ్చని, తక్కువ ఖర్చులో లభించే ఈ టీకాతో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మేలు జరుగుతుందని వివరించారు.

**ఏటా 95,000 మంది మృతి**

ఆహారం, నీటి కల్తీ వల్ల కలరా వ్యాధి విస్తరిస్తుంది. ఏటా 28 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడుతుంటే, దాదాపు 95,000 మంది చనిపోతున్నారు. నోటి ద్వారా తీసుకునే కలరా టీకా అమ్మకాలు ఏటా 10 కోట్ల డోసుల వరకు నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఒకే కంపెనీ ఇటువంటి టీకాను సరఫరా చేస్తున్నందున, టీకా లభ్యత సమస్యగా ఉంది. భారత్ బయోటెక్ హైదరాబాద్, భువనేశ్వర్‌లోని తన యూనిట్లలో ఏడాదికి 20 కోట్ల డోసుల టీకా ఉత్పత్తి చేయడానికి తగిన సన్నాహాలు చేస్తోంది.

## కుంకీలు వచ్చేస్తున్నాయ్

బెంగళూరు: కర్ణాటకఆంధ్రప్రదేశ్ మధ్య గత ఆగస్టులో చేసుకున్న ఒప్పందం ప్రకారం కన్నడనాడు నుంచి కుంకీ ఏనుగులను తరలించారు. బెంగళూరులోని విధానసౌధ ముంగిట బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే ఈ ఏనుగుల బదిలీ ఆదేశ పత్రాలను ఆంధ్రప్రదేశ్ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అందించారు. ఒప్పందం ప్రకారం ఆరు కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించాల్సి ఉన్నా శిక్షణ, ఆరోగ్య ప్రమాణాల దృష్ట్యా బుధవారం నాలుగింటినే తరలించారు. మరో విడతలో మిగిలిన రెండూ వస్తాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ మనుషులకు, ఏనుగులకు మధ్య సంఘర్షణలను నివారించేందుకు రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని వెల్లడించారు. గతేడాది ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కుంకీ ఏనుగుల కోసం ప్రతిపాదన చేయగానే తాను అంగీకరించానన్నారు. కర్ణాటకలో 3,695 ఏనుగులున్నట్లు వెల్లడించిన సిద్ధు.. దేశంలో అత్యధిక సంఖ్యలో ఇక్కడే ఉన్నాయన్నారు. ఏపీకి నాలుగు కుంకీలను పంపుతున్నామని, నెలపాటు వాటి మావటీలు ఏపీ బృందాలకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మానవ, ఏనుగుల సంఘర్షణ కొనసాగుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక ఇచ్చిన సహకారాన్ని ఆయన కొనియాడారు. ఈ సంఘర్షణను నివారించటంలో కర్ణాటక చేపడుతున్న చర్యలు అనుసరణీయమన్నారు. రెండు వేర్వేరు పార్టీలకు చెందిన ప్రభుత్వాలున్నా పర్యావరణం, ప్రకృతి పరిరక్షణకు మనమంతా భారతీయులమన్న సమైక్యతా సందేశాన్ని ఈ ఒప్పందం నిరూపించిందని చెప్పారు. కర్ణాటక అందించిన ఈ ఏనుగులు భవిష్యత్తులో ఎన్నో ప్రాణాలను, పంట నష్టాన్ని నివారిస్తాయన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిలువరింత, అటవీ సంపద రక్షణలో ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయం కొనసాగుతుందని ప్రకటించారు. కుంకీ ఏనుగుల పోషణను తానే పర్యవేక్షిస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. తన ప్రసంగంలో ఎక్కువగా కన్నడ భాషనే ఉపయోగించిన పవన్.. కన్నడ జాతీయ కవి కువెంపు ప్రకృతిపై రచించిన కవితలను చదివి వినిపించారు. ఇదే సందర్భంగా అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే మాట్లాడుతూ కుంకీ ఏనుగులను ఇతర రాష్ట్రాలకు తరలించటంపై పలు విమర్శలు వస్తున్నాయని, వాటిని పట్టించుకోకుండా ప్రస్తుత కార్యక్రమం చేపట్టామన్నారు. తమ వద్ద అవసరానికి మించి కుంకీ ఏనుగులున్నాయని, పొరుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి వాటిని పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కర్ణాటక అటవీశాఖ కార్యదర్శి మీనాక్షి నేగి, ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము, హెచ్ఓఎఫ్ఎఫ్ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎ.కె. నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కోయగూడెం ఓబీ కార్మికులకు సింగరేణి ప్రకటించిన రూ.5000 బోనస్ తక్షణమే చెల్లించాలి

*** ఐ ఎఫ్ టీ యు డిమాండ్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కోయగూడెం ఓబి లో విధులు నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ , వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న 18 మందికి సింగరేణి ప్రకటించిన లాభాల బోనసు రూ.5000 లను నేటికీ అందలేదు .ఆ యొక్క కార్మికులు 100 నుండి 150 మస్టర్స్ చేసి ఉన్నారు .18 మంది 500 బోనస్ కు అర్హులు కానీ ఇంతవరకు వారికి



బోనస్ వర్తింప చేయకపోవడం సరికాదని సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎన్ సంజీవ్ ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ అన్నారు. బుధవారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ కార్యాలయం వద్ద కార్మికులతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ప్రకటించిన రూ.5000 ల బోనస్ తక్షణమే చెల్లించలేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఇట్టి బోనస్ విషయంపై కోయగూడెం ఓసి అధికారులకు ఇల్లందు జిఎం కి పలుమార్లు కార్మికులు విన్నపించుకున్న ఇంతవరకు స్పందన లేదని వాపోయారు కావున తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి కార్మికులకు 5000 వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రత్నాచారి, లక్ష్మయ్య ,శ్రీను, యాదగిరి, వసంతరావు ,భూక్య శ్రీను, తదితరులు పాల్గంటున్నారు.

## తాటి చెట్టు మీద నుంచి పడి గీత కార్మికుడు మృతి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పెద్దూరి బలరాం (50) అనే కల్లు గీత కార్మికుడు తాటి చెట్టు మీద నుంచి పడి మృతి చెందాడని ముస్తాబాద్ హెడ్ కానిస్టేబుల్ డి.భూమయ్య తెలిపారు. సోమవారం కల్లుగీసేందుకు ఉదయం 9గంటలకు ఇంటి వద్ద నుంచి బలరాం వెళ్లాడని, కొంగాపూర్ గ్రామ శివారులోని యాపకాయల మైసయ్య పొలం వద్ద తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి తాటి చెట్టు మీద నుంచి కింద పడి చనిపోయాడని తెలిపారు. మృతుని కుమారుడు పెద్దూరి సంజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ భూమయ్య తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : బిజెపి ముస్తాబాద్ మండల నాయకుడు మెరుగు అంజా గౌడ్ కూతురు వివాహం వేడుకలు బుధవారం జరిగాయి. ఈ వేడుకల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు. ఆయన వెంట పలువురు బిజెపి నాయకులున్నారు.

## పిల్లల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు పునరంకితం కావాలి

*** మండల విద్యాధికారి నిమ్మరాజిరెడ్డి**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పిల్లల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు పునరంకితం కావాలని ముస్తాబాద్ మండల విద్యాధికారి నిమ్మరాజిరెడ్డి అన్నారు. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ప్రైమరీ లెవెల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం మండల విద్యాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు మన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, నాణ్యమైన చదువు వల్ల మాత్రమే వారి జీవితాన్ని మార్చుకునే అవకాశం ఉంది కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నాణ్యమైన విద్య అందుతుందనే భరోసాను తల్లితండ్రులకు కల్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిలు బాలకిషన్, రాజేందర్, శ్రీనివాస్, రాజేశం, స్రవంతి, స్వామి, శివశంకర్, మల్లారెడ్డి, డిఆర్‌పి శ్యాసుందర్ ఉన్నారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలి

**: ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజాస్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. బుధవారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆకస్మిక సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు , సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కోఆర్డినేషన్ సెంటర్ ను సందర్శించారు. ఇప్పటివరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అట్టి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లాలోని పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ అవగాహనా



కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ అధికారులకు సూచించారు.కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు ఆ ప్రభుత్వం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్, ఎస్సై ఉమ , సిబ్బంది పాల్గొన్నారు.

## యాసిడ్ తో నోరు కడగాల్సి వస్తుంది జాగ్రత్త కేటీఆర్

*** ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య**

యాదగిరిగుట్ట , ప్రజా స్ఫూర్తి: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నల్లగొండ లో మాట్లాడిన మాటలు చూస్తుంటే ప్రజలు ముక్కుమీద వేలు వేసుకునేలా ఉన్నాయారు.మరొకసారి ఎమ్మెల్యే లు,మంత్రుల గురించి మాట్లాడితే కేటీఆర్ నోరును యాసిడ్ పోసి కడుగుతామన్నారు.అధికారం కోల్పోయిన తర్వాత మదం తో కేటీఆర్ పిచ్చి ఎక్కి మాట్లాడుతున్నారు.తెలంగాణ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వైపు సంక్షేమం, ఓ వైపు అభివృద్ధి చేస్తుంటే నల్గొండ కు వచ్చి అవాకులు చెవాకులు మాట్లాడుతూన్న కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవలన్నారు. నల్లగొండ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ,కోమటిరెడ్డి వెంకట రెడ్డి గురించి,ఎమ్మెల్యేల గురించి నోరు జారీ మాట్లాడుతున్నారని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రాజెక్టుల పై తాగు,సాగు నీటి పై సమీక్ష సమావేశలతో ప్రాజెక్టులను,కాల్వలను ముందుకు తీసుకొని పోతుంటే మంత్రుల గురించి మాట్లాడటం సిగ్గుచేటుగా ఉందన్నారు.మీ పది ఏళ్ల పాలన లో ఎక్కడ అభివృద్ధి కాలేదన్నారు.మీ పది ఏళ్ల పాలనలో మీ



నాయనా, మీ బావ, చెల్లె దోపిడీకి తెలంగాణ నష్టానికి గురైందన్నారు.నల్గొండ జిల్లా మంత్రులు,ఎమ్మెల్యే ల గురించి మాట్లాడే నైతిక విలువలు మీకు లేవన్నారు. నల్లగొండ జిల్లా అన్నం పెట్టే జిల్లాగా మారింది దాన్ని చూసి ఓర్వలేక మాట్లాడుతున్నారని మండిపడ్డారు.మీరు చేసిన అప్పులు తీర్చుకుంటు రేవంత్ రెడ్డి గారు అన్నిటినీ సరిదిద్దుకుంటూ పాలనా అందిస్తున్నారని అన్నారు.మీవి కమిషన్ దందా,కాళేశ్వరం దందా,లిక్కర్ దందా ,మిషన్ భగీరథ స్కామ్ ,గోర్ల,బర్ల స్కామ్, అన్ని స్కాములను గుర్తు చేసి వెయ్యి ఎలుకలు తీన్న పిల్లి తీర్థ యాత్రలు పోయినట్టు కేటీఆర్ మాటలు ఉన్నాయన్నారు.మరొకసారి ఎమ్మెల్యే లు,మంత్రుల గురించి మాట్లాడితే కేటీఆర్ నోరును యాసిడ్ పోసి కడుగుతామన్నారు.

## మానసిక ఒత్తిడి పడకుండా విద్యాభివృద్ధికి శిక్షణ దోహదం

*** ఎంఈఓ చందా రమేష్**

రాజపేట ,ప్రజా స్ఫూర్తి :విద్యార్థులపై మానసిక ఒత్తిడి పడకుండా విజ్ఞానాభివృద్ధికి శిక్షణ దోహద పడుతుందని ఉపాధ్యాయులే కీలక పాత్ర వహించాలని రాజాపేట మండల విద్యాధికారి చందా రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం రాజాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఉపాధ్యాయులకు 2వ, రోజు శిక్షణ కార్యక్రమం లో శిక్షణ కోర్సు డైరెక్టర్ విద్యాధికారి చందా రమేష్ పాల్గొని ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. మాతృభాష, గణిత, ఆంగ్లంలోని శిక్షణ మెలకువలను ప్రాథమిక విద్య పూర్తయ్యే సరికి విద్యార్థులందరికి రావాలన్నారు. అక్షరలక్ష్యం సాధనకు ప్రతి ఉపాధ్యాయు డు బాధ్యత తో భోధనభ్యసన ప్రక్రియలతో పిల్లలకు మెరుగైన విద్య అందించాలని కోరారు. సహజ వాతావరణంలో విస్తృత విజ్ఞానాభివృద్ధికి అద్భుతమైన ప్రయత్నమే శిక్షణ అన్నారు. తెలుగు, గణితం, ఆంగ్లం తో మారుతున్న విజ్ఞాన పోకడల ను అనుసరించి విద్యాభోధన చేయాలనీ ఉపాధ్యాయులను 2గ్రూపులు గా విభజించి తెలుగు,గణితంలలో శిక్షణ టైం టేబుల్ ప్రకారం




నిర్వహించడం పట్ల అభినందించారు. ఈ సందర్భంగా తెలుగు లో పఠనము లేఖనం గణితం మెలకువలు ఆహ్లాదకరమైన వాతావరణంలో శిక్షణ జరిగింది.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు గా నమిల భరత్ కుమార్, కరుణాకర్, మహేందర్,భాస్కర్, నరేష్, సరిత, శ్రీధర్, రాజేశ్వరి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పిల్లల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు పునరంకితం కావాలి

*** మండల విద్యాధికారి నిమ్మరాజిరెడ్డి**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పిల్లల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు పునరంకితం కావాలని ముస్తాబాద్ మండల విద్యాధికారి నిమ్మరాజిరెడ్డి అన్నారు. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ప్రైమరీ లెవెల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం మండల విద్యాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు మన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, నాణ్యమైన చదువు వల్ల మాత్రమే వారి జీవితాన్ని మార్చుకునే అవకాశం ఉంది కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నాణ్యమైన విద్య అందుతుందనే భరోసాను తల్లితండ్రులకు కల్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిలు బాలకిషన్, రాజేందర్, శ్రీనివాస్, రాజేశం, స్రవంతి, స్వామి, శివశంకర్, మల్లారెడ్డి, డిఆర్‌పి శ్యాసుందర్ ఉన్నారు.

## రాజపేటలో రాజీవ్ గాంధీ వర్ధంతి



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ, వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. రాజపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐరేణి నవీన్ కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బల్ల మహేష్, పాండవుల బసవరాజు గౌడ్, కోటగిరి పండరి, గోలనకొండ బిక్షపతి, గొల్లైన స్వామి, పొట్ట బత్తిని వెంకటేష్, రేగు సిద్ధులు, సగ్గు లక్ష్మణ్, సురేష్, కొత్త కనకయ్య, పుల్లంగారి పోశయ్య, కిష్టయ్య, శంకరయ్య పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## నవ దంపతులను ఆశీర్వదించిన బీర్ల అనిత



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రం కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దోళ్ల ప్రభాకర్ వరలక్ష్మి దంపతుల కూతురు హారిక భాషల వివాహం బుధవారం జరగగా పాల్గొన్న బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత ఐలయ్య నవ దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ వరలక్ష్మి దంపతులు బీర్ల అనితను సాదరంగా ఆహ్వానించారు. సన్మానించి కృతజ్ఞతలు చెప్పారు.

# ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశంలో విప్లవాత్మక మార్పులు

*** కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**

*** ముస్తాబాద్‌లో రాజీవ్ గాంధీ వర్ధంతి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్



గాంధీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పిన్న వయసులో భారతదేశానికి ప్రధాన మంత్రిగా ఎన్నికై సమర్థవంతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో దేశాన్ని పరిపాలించిన ఘనుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. యువకులే దేశానికి రాబోయే రోజుల్లో వెన్నుముక అని 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించారు అన్నారని అన్నారు. టెలికాం, ఐటి రంగాల్లో ఇప్పుడు భారతదేశం ఈ స్థాయిలో ఉంది అంటే దానికి బీజం వేసింది రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశమే ముందు అంటూ ప్రతి రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి రాజీవ్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, పట్టణ అధ్యక్షులు, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

# దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ: సీఎం



ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఆర్థిక, సరళీకృత విధానాలతో భారత్‌ను బలమైన దేశంగా రాజీవ్‌గాంధీ నిలబెట్టారన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారని చెప్పారు. "పహల్గాం ఘటన నేపథ్యంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తిని దేశంలో ప్రతిఒక్కరూ గుర్తు తెచ్చుకున్నారు. దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పారు. మా దేశాన్ని మేం రక్షించుకోగలుగుతాం.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ఆమె ఆనాడే స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిది. రాహుల్ గాంధీని విమర్శించడం ద్వారా భాజపా నాయకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రానికి అండగా నిలబడాల్సిన సమయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బయటకు రాలేదు. మేం బయటకు వచ్చి మద్దతు తెలిపాం. ఆనాడు కనీసం మమ్మల్ని అభినందించని వ్యక్తి.. ఈరోజు రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారు. తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కిషన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారు. సెక్రటేరియట్ దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కొందరు విమర్శలు చేశారు. సంకుచిత మనస్తత్వం కలిగిన కొందరు ఆ వ్యాఖ్యలు చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ పార్టీది. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం.. అది మా బాధ్యత. దేశ సమగ్రత విషయంలో మేం రాజకీయాలు చేయం.. దేశ భద్రతకు కట్టుబడి పనిచేస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.



## మంత్రి ఉత్తమ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

కోదాడ: తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పలు లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలనకు హైదరాబాద్ నుంచి ఆయన బయల్దేరారు. ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో మేళ్లచెరువులో దిగాల్సిన హెలికాప్టర్.. కోదాడలోనే అత్యవసరంగా ల్యాండ్ అయింది. వాతావరణం అనుకూలించకపోవడంతో కోదాడలో దిగినట్లు మంత్రి సిబ్బంది తెలిపారు. అనంతరం రోడ్డుమార్గంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌కు బయల్దేరివెళ్లారు.

## రేపటి నుంచి తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు




రేపటి నుంచి తెలంగాణ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. మే 22 నుంచి 29, వరకు జరుగనుండగా.. ఉదయం 9:00-12:00 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2:30-5:30 గంటల వరకు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా 2,66,207 మంది ఫస్టియర్ పరీక్షలు, 1,47,390 మంది సెకండియర్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇక సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 36, ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ జూన్ 910, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ జూన్ 11, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ జూన్ 12న జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 926 కేంద్రాలలో ఈ పరీక్షలు జరుగుతాయని మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు ప్రకటించింది.

## లంచం తీసుకుంటూ
## ఏసీబీకి చిక్కిన ఏఈ ఇస్లావత్ వినోద్



అక్రమ సంపాదనకు ఆశపడి మరో అధికారి చిక్కుల్లో పడ్డారు. రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏఈ ఇస్లావత్ వినోద్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మిషన్ భగీరథ ఇంట్రా విభాగంలో వినోద్ ఏఈగా పనిచేస్తున్నారు. ఇటీవల బదిలీపై సూర్యాపేటకు వచ్చారు. ఎంబీ బుక్ రికార్డ్, రూ.20 లక్షల బిల్లుల మంజూరు కోసం లంచం డిమాండ్ చేశారు. తన అన్న కుమారుడు మూర్తితో కలిసి వినోద్ లంచం తీసుకున్నారు. ఇంతలో ఏసీబీ అధికారులు ఎంట్రీ ఇచ్చారు. వారిని చూసి వినోద్ పరుగులు తీశారు. స్థానిక పోలీసుల సాయంతో వినోద్‌ను ఏసీబీ అధికారులు కోదాడ వద్ద పట్టుకున్నారు. ఆయన అన్న కుమారుడు మూర్తి మాత్రం తప్పించుకున్నారు. ప్రస్తుతం మూర్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వినోద్‌ను హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాంగ్రెస్, భాజపా నాటకంలో
# భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు: కేటీఆర్



నల్గొండ: నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడంపై ఆయన స్పందించారు. చట్టాలు, న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్, భాజపా ఉమ్మడి నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ప్రజా సమస్యలు గాలికొదిలి ఇలాంటి పనులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దిక్కుతోచని పరిస్థితుల్లోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. ప్రజాపాలన.. కమీషన్ల పాలనగా మారిందని ఆరోపించారు. "ఎన్ని నోటీసులు ఇచ్చినా అవన్నీ దూదిపింజల్లా ఎగిరిపోతాయి. న్యాయం, ధర్మం గెలుస్తాయి.. నిజాయతీ ఎప్పటికీ ఓడిపోదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి చనిపోతే ఇంకా మృతదేహాలు బయటకు తీయలేదు. నల్గొండలో సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలింది.. ఇప్పటికీ చర్యల్లేవు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది. రూ.4 వేల పింఛన్ల మాట ఏమైంది" అని కేటీఆర్ ప్రశ్నించారు.

# ఆక్రమణలను ఉపేక్షించేది లేదు
## : హైడ్రా కమిషనర్ రంగనాథ్



శేరిలింగంపల్లి : భూ ఆక్రమణదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ప్రజావాణిలో భాగంగా హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ సొసైటీ ప్లాట్ ఓనర్స్ ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో బుధవారం శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లిలో రంగనాథ్ సోసైటి లేఅవుట్‌లో అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితిని బాధితులను అడిగి తెలుసుకున్నారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపనపల్లి సర్వే నంబర్ 163 నుంచి 286 వరకు మొత్తం 120 ఎకరాల 25 గుంటల విస్తరించి ఉన్న రంగనాథ్ సోసైటి లే అవుట్ లో 200, 300, 500 గజాల విస్తీర్ణంలో మొత్తం 1400 ప్లాట్లను విక్రయించారు. అయితే ఇందులో కొన్ని ప్లాట్లను కొనుగోలు చేసిన ఓ మాజీమంత్రి అల్లుడు, మిగతా ప్లాట్లను కూడా కలిపి కంచె వేశారని, అతనిపై గతంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ప్లాట్ ఓనర్స్ తెలిపారు. ఎన్నిసార్లు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో హైడ్రాకు ఫిర్యాదు చేసినట్లు రంగనాథ్ సొసైటీ ప్లాట్ ఓనర్స్ తెలిపారు. కరోనా సమయంలో బడా రియల్ ఎస్టేట్ సంస్థల యజమానులు సమూహంగా ఏర్పడి మా లేఔట్ మొత్తాన్ని కబ్జా చేశారని బాధితులు కమిషనర్ ముందు వాపోయారు. అప్పటికే కొంతమంది ఇళ్లను కట్టుకుని ఉండగా మమ్మల్ని తరిమేసి ఇండ్లను నేలమట్టం చేసి రహదారులు, పార్కులు కలిపేసి వ్యవసాయ భూమిగా మార్చేశారని ఆరోపించారు. చివరికి అందులో ఉన్న దేవుడి గుడిని కూడా వదల్లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకువచ్చారు. తాము కోర్టులను ఆశ్రయించామని.. వివాదం సుప్రీం కోర్టు వరకు వెళ్లిందని బాధితులు తెలిపారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు హై కోర్టు తమకు 4 వారాల్లో న్యాయం చేయాలని తీర్పు యిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా బాధితులు గుర్తు చేశారు. ఈ తీర్పు ప్రకారం ఆక్రమణలను తొలగించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, నోడల్ అధికారికి ఆదేశాలిచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్లాట్ ఉందనీ తాము ఆ స్థలం దరిదాపులకు వచ్చినా బౌన్సర్లను పెట్టి మా మీద దాడులు చేశారంటూ బాధితులు కన్నీరుమున్నీరు అయ్యారు. నిత్యం వందలాది మంది బౌన్సర్లను అక్కడ కాపలా పెట్టి అటు వైపు చూడడానికి కూడా వీలు లేకుండా చేస్తున్నారని హైడ్రా కమిషనర్ కు తెలిపారు. ఫిర్యాదు దారులు చెప్పినది విన్న కమిషనర్ రంగనాథ్.. వారం 10 రోజుల్లో ఇరుపక్షాలను పిలిపించి మాట్లాడుతానని.. ఆందోళన చెందవద్దని ప్లాట్ యజమానులకు భరోసా ఇచ్చారు. అన్ని కోణాల్లోనూ పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

## సెక్రటేరియట్ వద్ద జర్నలిస్టులతో ట్రాఫిక్ సీఐ దురుసు ప్రవర్తన

సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద జర్నలిస్టులపై ట్రాఫిక్ సీఐ భాస్కర్ దురుసుగా ప్రవర్తించారు. మీడియా పాయింట్ వద్ద జర్నలిస్టులు బైకులు పార్కింగ్ చేసుకోగా వాటిని తీసివేయాలని, తాను సెక్రటేరియట్ వద్ద డ్యూటీలో ఉన్న ఆఫీసర్ అంటూ జర్నలిస్టులను బెరించారు. దీంతో తమకు ఇదొకటే పార్కింగ్ స్థలం ఉందని జర్నలిస్టులు చెబుతున్నా వినకుండా సీఐ చేయివేసి వారిని నెట్టేశాడు. దీంతో అక్కడే ఉన్న సీనియర్ జర్నలిస్టులు సీఐ భాస్కర్‌తో వాదించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# జూన్ 3నుంచి అయోధ్యలో రామ్ దర్బార్ 'ప్రాణ ప్రతిష్ఠ' మహోత్సవం

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరం నిర్మాణం జూన్ 5 నాటికి ముగుస్తుందని శ్రీ రామ్ జన్మభూమి నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఈ నేపథ్యంలో జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు ఆలయంలో రామ్‌దర్బార్ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జూన్ 5న జరిగే ఈ ప్రతిష్ఠాపన మహోత్సవానికి వివిధ విశ్వాసాలకు చెందిన ఆధ్యాత్మిక పెద్దలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రముఖ వార్తా సంస్థ 'పీటీఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈ వేడుకకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వీఐపీలను ఆహ్వానించడంలేదని తెలిపారు. దాదాపు ఐదు వందల ఏళ్ల పోరాటం తర్వాత ఈ క్షణం ఆసన్నమైందన్న నృపేంద్ర మిశ్రా.. రామాలయం నిర్మాణం వెనుక ఎలాంటి రాజకీయ లక్ష్యాలు లేవన్నారు. జూన్ 5 వేడుక అనంతరం వారం రోజుల్లో అయోధ్యలోని రామాలయంలోని కొత్త భాగాన్ని ప్రజల కోసం తెరవనున్నట్లు తెలిపారు. అయోధ్యలో బాల రాముడు



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గతేడాది జనవరి 22న కన్నుల పండువగా నిర్వహించిన విషయం తెలిసిందే. మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ప్రాణప్రతిష్ఠ వేడుక నిర్వహించారు. దేశ విదేశాల నుంచి దాదాపు 7,000 మందికి పైగా ప్రముఖులు ఆ మహత్తర ఘట్టాన్ని వీక్షించారు. అనంతరం అయోధ్య మందిరంలో రాముడిని దర్శించుకొనేందుకు ప్రపంచ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు.



## 'పాక్‌లో నన్ను పెళ్లి చేసుకో'.. జ్యోతి మల్హోత్రా చాటింగ్ లీక్!

పాకిస్థాన్‌కు గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పాక్‌లో వివాహం చేసుకునేందుకు ఆమె సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఐఎస్ఐతో సంబంధాలున్న హసన్ అనే వ్యక్తితో ఆమె గతంలో చేసిన చాటింగ్ వివరాలు తాజాగా బయటకొచ్చాయి. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న అలీ హసన్‌తో ఆమె నిరంతరం టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కోడ్ భాషలో ఎన్నో విషయాలు మాట్లాడుకునేవారు. తాజాగా అవన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తనను పాకిస్థాన్‌లోనే వివాహం చేసుకోవాలని జ్యోతి కోరింది. దీంతో పాటు భారత్‌కు సంబంధించిన రహస్య కార్యకలాపాల గురించి కూడా చర్చించారు. అంతేకాకుండా ఆమెకు నాలుగు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని.. దుబాయ్ నుంచి వాటిలో డబ్బు జమ అవుతోందని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. దీనిపై మరింత లోతుగా విచారణ కొనసాగుతోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తోంది. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. భారత్‌కు వచ్చిన తర్వాత కూడా అతడితో కాంటాక్టు అయినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అతడి సూచన మేరకు.. అలీ అనే వ్యక్తిని ఆమె కలిసింది. అతడు పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను జ్యోతికి పరిచయం చేసినట్లు సమాచారం. దేశ రక్షణకు చెందిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని ఆమె పాక్ వ్యక్తులకు చేరవేసినట్లు అధికారులు ఆరోపించారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను కూడా భారత్‌లో నిలిపివేశారు. పాక్ హైకమిషన్‌కు చెందిన వ్యక్తితో ఆమె వివాహానికి సంబంధించిన చాటింగ్ వివరాలు బయటకొచ్చాయి.

## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్.. నక్సలిజంపై పోరాటంలో ఘన విజయమంటూ మోదీ పోస్ట్

దిల్లీ: ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోదీ తాజాగా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. ''మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి.. ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది'' అని ప్రధాని పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్



బసవరాజు మృతి చెందినట్లు ఎక్స్ వేదికగా అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. ''నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది'' అని రాసుకొచ్చారు. మాఢ్ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ డీఆర్జీ బలగాలు పాల్గొన్నాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌తెలంగాణ సరిహద్దుల్లోని కరేగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. వీరిలో 16 మంది మహిళలు ఉన్నారు.

## రాత్రి వేళ కోల్‌కతాలో డ్రోన్ల లాంటి వస్తువుల కలకలం.. పోలీసుల అప్రమత్తం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా నగరంలో ఇటీవల రాత్రి వేళల్లో ఆకాశంలో డ్రోన్లను పోలిన వస్తువులు కనిపిస్తుండటం కలకలం రేపింది. భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నగర పోలీసులు ఈ ఘటనపై అప్రమత్తమయ్యారు. గూఢచర్యంతోపాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నగరంలోని హేస్టింగ్స్ ప్రాంతం, విద్యాసాగర్ సేతు తదితర ప్రాంతాల్లో దాదాపు 10 డ్రోన్ల లాంటి వస్తువులు ఆకాశంలో ఎగురుతూ కనిపించినట్లు పోలీసులు వెల్లడించారు.



ఈ ఘటనపై నివేదిక అందిందని.. దర్యాప్తు కొనసాగుతోందని రక్షణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ అంశంపై కేంద్రం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుంచి నివేదిక కోరినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఈ డ్రోన్లను పోలిన వస్తువుల కదలికలను హేస్టింగ్ పోలీసు స్టేషన్ పోలీసులు మొదట గుర్తించారు. వీటికి డ్రోన్లతో పోలికలు ఉన్నట్లు వారు చెబుతున్నారు. దక్షిణ 24 పరిగణాల జిల్లాలోని మహేస్థల వైపు నుంచి ఇవి వచ్చాయని తెలిపారు. ప్రత్యేక టాస్క్ ఫోర్స్, కోల్‌కతా డిటెక్టివ్ విభాగాలు దీనిపై దర్యాప్తు ప్రారంభించాయని వెల్లడించారు. ఈ డ్రోన్లు ఎవరికి సంబంధించినవి? వీటితో ఎవరైనా గూఢచర్యానికి పాల్పడుతున్నారా? అనే విషయాలు దర్యాప్తులో తేలుతాయని అధికారులు తెలిపారు.

## అపరేషన్ సిందూర్ ఎఫెక్ట్.. నీటికోసం సింధ్ హోంమంత్రి ఇంటిపై దాడి



భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా సింధూ నది నుంచి పాక్‌కు నీటిని నిలిపివేసింది. దీంతో పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్ లో వ్యవసాయం చేసే రైతులపై తీవ్ర ప్రభావం పడింది. అలాగే ఇండస్ నదిపై నిర్మించిన వివాదాస్పద చోలిస్తాన్ కెనాల్ ప్రాజెక్ట్‌కు కూడా తమకు నష్టం కలిగిస్తుందని బావించిన స్థానికులు కొద్ది రోజులుగా నిరసనలు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం సింధ్ ప్రావిన్స్ హోం మినిస్టర్ జియావుల్ హసన్ లంజార్ ఇంటిపై దాడి జరిగింది. సింధ్ ప్రావిన్స్ హోం మినిస్టర్ జియావుల్ హసన్ లంజార్ ఇంటిపై నిరసనకారులు దాడి చేసి, ఆయన నివాసానికి నిప్పు పెట్టారు. ఈ దాడి చోలిస్తాన్ కెనాల్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా జరిగిన హింసాత్మక నిరసనల్లో భాగంగా నిలిచింది. ఈ కెనాల్ సింధ్‌లోని నీటి వనరులను పంజాబ్ ప్రావిన్స్‌కు మళ్లిస్తుందని, దీనివల్ల స్థానిక రైతులు, సమాజాలు నీటి కొరతను ఎదుర్కొంటాయని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఈ నీటి వివాదం లో బాగంగా ప్రారంభం అయిన నిరసనలు మంత్రి నివాసంపై దాడి తర్వాత ఉద్రిక్తంగా మారాయి. ఈ నిరసనలను అడ్డుకునేందుకు పోలీసుల ప్రయత్నించగా.. ఆందోళనకారులు పోలీసులపై దాడికి దిగారు. ఈ క్రమంలో వారిని అదుపు చేసేందుకు పోలీసులు అందోళనకారులపై కాల్పులు జరపగా.. ఒక వ్యక్తి మృతి చెందారు.

## మాకు ఎవరి అనుమతి అవసరం లేదు.. అమెరికాకు షాక్ ఇచ్చిన ఇరాన్

ఇరాన్ అణు కార్యక్రమాలపై ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ స్పందించారు. యురేనియం శుద్ధిపై తమకు ఎవరి అనుమతి అవసరం లేదన్నారు. అమెరికా పరిమితులు విధించడాన్ని ఖండించారు. హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయిన ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ స్మారక కార్యక్రమంలో ఖమేనీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇరాన్ యురేనియం శుద్ధి అపరిమితంగా తయారుచేయడానికి మేము అనుమతించమని వారు (అమెరికాను ఉద్దేశిస్తూ) అంటున్నారు. అయితే, ఇది పూర్తిగా అర్థం లేనిది. ఒకరి అనుమతి కోసం వేచి చూడాల్సిన అవసరం ఇరాన్‌కు లేదు. మా సొంత విధానాలు మాకు ఉన్నాయి. వాటికి కట్టుబడి ఉంటాం. ప్రస్తుత తరహాలోనే రైసీ హయాంలో కూడా పరోక్ష చర్చలు జరిగాయి. అయితే వాటిల్లో ఎలాంటి పురోగతి జరగలేదు. ప్రస్తుత చర్చల



నుంచి కూడా మేం ఎక్కువగా ఆశించడం లేదు. ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు' అని ఖమేనీ పేర్కొన్నారు.

### ఇరాన్ తో అమెరికా చర్చలు

మరోవైపు, ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోకుండా నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఈక్రమంలోనే మరోసారి అణుఒప్పందం కుదుర్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుముఖత వ్యక్తంచేశారు. అందులోభాగంగా ఇరాన్, అమెరికాకు చెందిన అధికారుల మధ్య ఇటీవల పలు విడతల్లో చర్చలు జరిగాయి. అయితే, మూడో విడత చర్చల్లో యురేనియం శుద్ధి అంశమే ప్రధానంగా చర్చించారు. పౌర అవసరాలకు మాత్రమే అణుశుద్ధి కార్యక్రమాన్ని టెహ్రాన్ పరిమితం చేయాలని ట్రంప్ సర్కారు పట్టుబడుతోంది. అణ్వాయుధాలు తయారుచేసే స్థాయిలో ఉండకూడదని చెబుతోంది. దీనిపైనే ఇప్పుడు ఖమేనీ స్పందించారు. మరోవిడత చర్చలు ఎప్పుడు జరుగుతాయనే దానిపై నిర్ణయం తీసుకోలేదని ఇటీవలే ఇరాన్ పేర్కొంది.

## పరాజయానికి ప్రమోషన్లా?.. పాక్ పై బీజేపీ విమర్శలు

పాకిస్థాన్ ప్రభుత్వంపై బీజేపీ మరోసారి విమర్శలు గుప్పించింది. పాక్ సైనిక బలగాల ప్రధానాధికారి ఆసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. అయితే, ఈ ప్రమోషన్ పై బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాల్వియా స్పందించారు. పరాజయానికి కూడా ప్రమోషన్లు ఉంటాయా అంటూ పాకిస్థాన్‌ను ఎగతాళి చేశారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'వైఫల్యానికి కూడా రివార్డులుంటాయనే దానికి ఇదే ఉదాహరణ. భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ కు కోలుకోలేని దెబ్బకొట్టాం. 9 ఉగ్రస్థావరాలను నేలకూల్చాం. 13 వైమానిక స్థావరాలు, జాతీయ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో పాటు వందలాది డ్రోన్‌లను ధ్వంసం చేశాం. పాకిస్థాన్ కు చెందిన 70 మందికి పైగా సైనిక సిబ్బంది మరణించారు. ఈ దెబ్బలకు తట్టుకోలేక కాల్పుల విరమణ చేపట్టాలని మనల్ని అభ్యర్థించింది.



# ఇల్లే వనమైతే... స్వీట్ హోమ్

ప్రకృతి ఇచ్చే ఆహ్లాదకరమైన వాతావరణం మనలో ఉల్లాసం, ఉత్సాహాల్ని నింపుతాయి కదా! అందుకే, ఇంటిని మొక్కలతో అలంకరిస్తుంటాం. కానీ, వాటితోనే సరిపెట్టుకోవాలనుకోవడం లేదు చాలామంది పర్యావరణ ప్రేమికులు. కేవలం చిన్న కుండీల్లో మొక్కల్ని పెంచడం కాదు, ఏకంగా ఇంట్లోనే ప్రకృతి వనాల్ని సృష్టిస్తున్నారు. 'బయోఫిలిక్' డిజైన్‌గా పిలుస్తారు దీన్ని. ఇదే తాజా ట్రెండ్. కాంక్రీటు ఇళ్లను కూడా పచ్చని మొక్కలు, పారేనీరు, సహజకాంతి ఉండేలా తీర్చిదిద్దడమే ఇందులో విశేషం. భిన్న రకాల టెక్చర్లు, నమూనాలతో సృజనాత్మకత జోడిస్తూ గదిగదికీ ప్రత్యేక ఆకర్షణ తీసుకొస్తున్నారు డిజైనర్లు. హా... ఈ అపార్ట్‌మెంట్ గదుల్లో అది సాధ్యమా? అంటారేమో... సహజ సిద్ధమైన మెటీరియళ్లు, ఎర్తీ కలర్ స్కీమ్‌లను ఉపయోగించి ఆధునిక భవనాలను కూడా ఆహ్లాదకరమైన ప్రదేశాలుగా మలుస్తున్నారు.. ఇంటికి అందంతోపాటు మానసిక ప్రశాంతతను అందిస్తూ ఉత్పాదకతను పెంచే ఇలాంటి ప్రదేశం ఇంట్లో ఒక్కటున్నా చాలు కదా!











# జుట్టు ఊడిపోతోందా..?



రోజురోజుకీ పెరిగిపోతున్న కాలుష్యం, మారుతున్న జీవన విధానం కురుల మీద కూడా ప్రభావం చూపిస్తున్నాయి. అందుకే జుట్టు వూడిపోవడం, పలుచగా అయిపోవడం.. వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. వీటికి తోడు స్టైలింగ్ కోసం ఉపయోగించే ఉత్పత్తులు కూడా కేశాలను నిర్జీవంగా మార్చేస్తున్నాయి. మరి, వీటికి పరిష్కారం ఏమిటి? ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? చక్కటి కేశసంపదను సొంతం చేసుకోవడం ఎలా..?



### కెమికల్స్‌కి దూరంగా..

జుట్టు ఎదగడానికి అవసరమయ్యే పోషకాలను ఎప్పటికప్పుడు ఆహారం ద్వారానే కాకుండా బయట నుంచి కూడా అందిస్తూ ఉండాలి. అలాగే జుట్టు శుభ్రంగా ఉండేలా చూసుకోవడం కూడా తప్పనిసరి. అంటే దుమ్ము, ధూళి, చుండ్రు.. ఇలాంటివేవీ లేకుండా జాగ్రత్తపడాలి. తలస్నానం చేసేటప్పుడు కూడా ఎంతమేరకు షాంపూ అవసరమో అంతే వినియోగించాలి. వీటిలో సల్ఫేట్ లేకుండా చూసుకోవాలి. అవసరానికి మించి షాంపూ ఉపయోగించినప్పుడు దాని ప్రభావం జుట్టు మీద తప్పకుండా కనిపిస్తుంది. అందుకే రసాయనాలు ఎక్కువగా ఉండే ఉత్పత్తుల్ని ఎంత తక్కువ వాడితే జుట్టుకి అంత శ్రేయస్కరం.

### తొందరగా ఆరాలని..

ఆఫీసుకి టైం అవుతోందనో, కాలేజీ బస్సు మిస్సవుతుందనో జుట్టు త్వరత్వరగా ఆరిపోవాలని డ్రయర్లు వాడుతూ ఉంటాం. అయితే వీటివల్ల అప్పటికప్పుడు జుట్టు ఆరిపోయి సమస్య పరిష్కారమైనా.. అవి కొత్త సమస్యలు తెచ్చిపెడతాయి. అలాంటి ఉత్పత్తుల ద్వారా విడుదలయ్యే వేడి.. జుట్టుని మరింత బలహీనపరుస్తుంది. ఫలితంగా తల దువ్వేటప్పుడు వెంట్రుకలు సగంలో తెగిపోవడం లేదా మొత్తానికి వూడిపోవడం జరుగుతుంది. కాబట్టి డ్రయర్లు, కర్లర్స్, స్ట్రెయిటనర్స్.. మొదలైన ఉత్పత్తులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది అంటున్నారు నిపుణులు.

### జుట్టుని బిగుతుగా కట్టద్దు..

కొంతమంది స్టైల్‌గా కనిపించడానికో లేక సమయాభావం వల్లనో ఎక్కువగా పోనీటెయిల్స్ వేసుకుంటూ ఉంటారు. కానీ జుట్టంతా అలా బిగుతుగా లాగి బ్యాండ్ పెట్టడం వల్ల కుదుళ్లు బలహీనమవుతాయి. జుట్టుపై ఒత్తిడి పెరిగి తెగిపోతుంది. కాబట్టి జుట్టుని సాధ్యమైనంత వరకు వదులుగానే ఉంచాలి. అలా వదులుగా ఉండే హెయిర్‌స్టైల్స్ ప్రయత్నించడమే ఉత్తమం.

### చివర్లు ట్రిమ్ చేయాలి..

జుట్టు చివర్లను ఎప్పటికప్పుడు ట్రిమ్ చేస్తుండాలి. ఇలా చేయడం వల్ల చివర్లు ఆరోగ్యంగా ఉంటాయి. జుట్టుకు అవసరమయ్యే పోషణ సులభంగా అంది, ఎదుగుదల బాగుంటుంది.

# స్టాక్ మార్కెట్ల మూడు రోజుల నష్టాలకు బ్రేక్

**410 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్**

**129 పాయింట్లు లాభపడ్డ నిఫ్టీ**

**2 శాతానికి పైగా పెరిగిన బజాజ్ ఫిన్ సర్వ్ షేరు విలువ**



**ముంబై:** వరుసగా మూడు సెషన్ల నుంచి నష్టాలను చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. రియాల్టీ, ఫార్మా సూచీల అండతో మార్కెట్లు లాభపడ్డాయి. ఒకానొక సమయంలో 800 పాయింట్ల మేర లాభపడ్డ సెన్సెక్స్... చివరకు 410 పాయింట్ల లాభంతో 81,596 వద్ద ముగిసింది. నిఫ్టీ 129 పాయింట్లు పెరిగి 24,813 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 85.64గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

బజాజ్ ఫిన్ సర్వ్ (2.02%), టాటా స్టీల్ (1.86%), సన్ ఫార్మా (1.57%), టెక్ మహీంద్రా (1.39%), బజాజ్ ఫైనాన్స్ (1.36%).

**టాప్ లూజర్స్:**

ఇండస్ ఇండ్ బ్యాంక్ (-1.39%), కొటక్ మహీంద్రా (-0.77%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (-0.62%), ఐటీసీ (-0.44%), అల్ట్రాటెక్ సిమెంట్ (-0.42%).

# ఈ బుల్లి ఎస్‌యూవీలు భలే బాగున్నాయ్..

**దాదాపు ఒకే ఫీచర్లతో రెండు కార్లు**



**న్యూఢిల్లీ:** మన దేశంలోని కార్ల మార్కెట్ లో వివిధ కంపెనీల మధ్య పోటీ నెలకొంది. ప్రజల అవసరాలు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా వివిధ మోడళ్ల వాహనాలు తయారవుతున్నాయి. నేటి కాలంలో మధ్యతరగతి ప్రజలు కూడా కార్లను వినియోగిస్తున్నారు. వారి ఆదాయ స్థాయికి అనుగుణంగా అందుబాటు ధరల్లో లభించడమే దీనికి కారణం. పెట్రోలు, డీజిల్, సీఎన్జీ, ఎలక్ట్రిక్.. ఇలా అనేక విభాగాల్లో కార్లు సందడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయగలిగే కార్లలో సిట్రోయెన్ సీ3, టాటా పంచ్ ముందుంటాయి.

ఫ్రెంచ్ కంపెనీ నుంచి విడుదలైన సిట్రోయన్ సీ3 కారును మన దేశ మార్కెట్ కు అనుగుణంగా తయారు చేశారు. దీన్ని ఇటీవల సీఎన్జీ పవర్ ట్రెయిన్ ఎంపికతో ఆధునీకరించారు. అయితే సీఎన్జీ కిట్లను డీలర్ స్థాయిలో ఇన్ స్టాల్ చేస్తారు. మార్కెట్ లో ప్రస్తుతం ఉన్న మారుతీ బాలెనో, ఇతర ప్రీమియం హ్యాచ్ బ్యాక్ లకు సిట్రోయెన్ సీ3 పోటీగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా టాటా పంచ్ తో ప్రధాన పోటీ ఉంటుంది. ఎందుకంటే ఇవి రెండింటినీ బేబీ ఎస్ యూవీలుగా భావించవచ్చు. స్టైల్, పవర్ ట్రెయిన్, ఇతర లక్షణాలలో ఒకే విధంగా కనిపిస్తాయి.

సిట్రోయెన్ సీ3 కారు రూ.6.23 లక్షల(ఎక్స్ షోరూమ్)కు అందుబాటులోకి వచ్చింది. అదనంగా మరో రూ.93 వేలు చెల్లించి సీఎన్జీ కిట్ ను ఏర్పాటు చేసుకోవచ్చు. 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ ఇంజిన్ కలిగిన లైవ్, ఫీల్, ఫీల్ (ఓ), షైన్ వేరియంట్ల కోసం ప్రత్యేకంగా ఈ కిట్లను తయారు చేశారు. టాటా పంచ్ ఐసీఎన్జీ కారు ధర రూ.7.30 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది.

సిట్రోయెన్ సీ3 కారులో 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ ఇంజిన్ ఏర్పాటు చేశారు. దీనికి ఐదు స్పీడ్ గేర్ బాక్స్ జత చేశారు. ఇంజిన్ నుంచి రూ.81 బీహెచ్ పీ, 115 ఎన్ ఎం టార్కు విడుదల అవుతుంది. ఇక సీఎన్ జీ ఎంపికతో వాస్తవ అవుట్ పుట్ ను కంపెనీ తెలపలేదు. అయితే ఫ్యాక్టరీ పరీక్షించిన కిట్లు 28.1 కిలోమీటర్ల వరకూ మైలేజీ ఇస్తాయని చెబుతున్నారు.

# ఎగుమతులతో ఇతర దేశాల మతిపోగొడుతున్న భారత్

**ఆ రంగంలో వేగంగా వృద్ధి**



**న్యూఢిల్లీ:** ఇటీవల విడుదలైన డేటా ప్రకారం దేశంలో పెట్రోలియం ఉత్పత్తులు, వజ్రాలు వంటి సాంప్రదాయ ఎగుమతులను అధిగమించి భారతదేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు గత మూడేళ్లల్లో బాగా పెరిగాయి. అమెరికాకు దాదాపు ఐదు రెట్లు, జపాన్‌కు దాదాపు నాలుగు రెట్లు పెరిగాయి. స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 2023-24లో 15.57 బిలియన్ల డాలర్లు, 2022-23లో 10.96 బిలియన్ల డాలర్ల నుంచి 2024-25లో 24.14 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశం స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో అత్యధిక వృద్ధిని నమోదు చేసిన మొదటి ఐదు దేశాలు అమెరికా, నెదర్లాండ్స్, ఇటలీ, జపాన్, చెక్ రిపబ్లిక్‌గా ఉన్నాయి. అమెరికాకు భారతదేశం ఎగుమతులు 2022-23లో 2.16 బిలియన్ల డాలర్ల నుంచి 2023-24లో 5.57 బిలియన్ల డాలర్లకు, 2024-25లో 10.6 బిలియన్ల డాలర్లకు పెరిగాయి.

ఎగుమతుల విషయంలో జపాన్‌లో కూడా గణనీయమైన ఎగుమతి వృద్ధి నమోదైంది. ఈ దేశానికి ఎగుమతులు 2022-23లో 120 మిలియన్ల డాలర్లకు నుంచి 2025 ఆర్థిక సంవత్సరంలో 520 మిలియన్ల డాలర్లకు పెరిగాయి. ఈ వేగవంతమైన పెరుగుదల వల్ల స్మార్ట్‌ఫోన్లు భారతదేశంలో అత్యధికంగా ఎగుమతి చేసిన వస్తువుల్లో ఒకటిగా మారిందని. పెట్రోలియం ఉత్పత్తులు, వజ్రాలు వంటి ఎగుమతులను అధిగమించడానికి దోహదపడిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారి తెలిపారు.

ఉత్పత్తి-సంబంధిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం వంటి ప్రభుత్వ పథకాల వల్ల వృద్ధి వేగంగా పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. 'మేక్ ఇన్ ఇండియా' సర్వీస్ నివేదిక ప్రకారం 2024లో భారతదేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో ఆపిల్, సామ్‌సంగ్ దాదాపు 94 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2024లో మేడ్-ఇన్- ఇండియా స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు సంవత్సరానికి 6 శాతం పెరిగాయి. 2025లో భారతదేశంలో స్మార్ట్‌ఫోన్ తయారీ వృద్ధి అంచనా 2025లో రెండంకెలలో పెరుగుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



# ఢిల్లీని ముంచిన సూర్య, శాంట్నర్..

## ప్లే ఆఫ్స్‌లో ముంబై..

**వాంఖడే:** ఐదు సార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. వాంఖడే స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్‌ను చిత్తు చేసి చివరి బెర్తును కైవసం చేసుకుంది. మొదట సూర్యకుమార్ యాదవ్(73 నాటౌట్) మెరుపు అర్థశతకంతో భారీ స్కోర్ చేసిన ముంబై.. ఆ తర్వాత ప్రత్యర్థిని వణికించింది. పేసర్లు టాపార్డర్‌ను కూల్చగా.. స్పిన్నర్ మిచెల్ శాంట్నర్(3-11) సంచలన స్పెల్‌తో ఢిల్లీ మిడిలార్డర్ పని పట్టాడు. ముస్తాఫిజుర్‌ను బుమ్రా(3-12) బౌల్డ్ చేయడంతో 59 పరుగుల తేడాతో ముంబై జయకేతనం ఎగురవేసింది. దాంతో. నాకౌట్ పోరుకు దూసుకెళ్లాలనుకున్న ఢిల్లీ ఆశలు ఆవిరయ్యాయి.

వాంఖడేలో ముంబై ఇండియన్స్ విజయగర్జనతో ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టింది. వరుసగా రెండు ఓటములు.. ఆపై కోల్‌కతాపై విజయం.. అనంతరం ఆర్సీబీ చేతిలో ఓటమి.. ఆనక వరుసగా ఆరేసి విక్టరీలతో ప్లే ఆఫ్స్ బరిలో నిలిచిన ముంబై.. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌ను నాకౌట్ చేసింది.

**విప్రజ్, రిజ్వీ పోరాడినా..**

ముంబై నిర్దేశించిన 181 పరుగుల ఛేదనలో ఢిల్లీ ఆదిలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ ఫాఫ్ డూప్లెసిస్(6)ను చాహర్ ఔట్ చేసి తొలి బ్రేకిచ్చాడు. రెండు ఫోర్లు బాదిన ఓపెనర్ కేఎల్ రాహుల్(11)ను బౌల్ట్ వెనక్కి పంపాడు. ఆ కాసేపటికే యువకెరటం అభిషేక్ పొరెల్(6)ను రికెల్టన్ స్టంపౌట్ చేసి ఢిల్లీని పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు. 27 పరుగులకే మూడు కీలక వికట్లు పడిన ఢిల్లీని విప్రజ్ నిగమ్(20 నాటౌట్), సమీర్ రిజ్వీ (39)లు ఆదుకునే ప్రయత్నం చేశారు. జాక్స్ ఓవర్లో వరుసగా 6, 6, ఫోర్ బాదిన అతడు.. రిజ్వీతో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించాడు.



దాంతో, 6 ఓవర్లకు ఆ జట్టు 3 వికెట్ల నష్టానికి 49 పరుగులు చేసింది. స్ట్రాటజిక్ బ్రేక్ తర్వాత బంతి అందుకున్న శాంట్నర్.. రిటర్న్ క్యాచ్‌తో విప్రజ్‌ను ఔట్ చేసి ఢిల్లీ కష్టాలను మరింత పెంచాడు.

ఆ కాసేపటికే బుమ్రా బౌలింగ్‌లో స్టబ్స్ ఎల్బీగా వెనుదిరిగాడు. అంతే.. ఢిల్లీ ఓటమి అంచున నిలిచింది. కానీ, అశుతోష్ శర్మ(18) రాకతో స్కోర్ బోర్డు పరుగందుకుంది. కరణ్ శర్మ వేసిన 11వ ఓవర్లో అశుతోష్ 4, 6 కొట్టగా.. రిజ్వీ 4 బాదాడు. ఆ తర్వాత బౌల్ట్ ఓవర్లో రిజ్వీ బౌండరీతో ఢిల్లీ స్కోర్ 100కి చేరింది. 38 రన్స్ జోడించి ఆశలు రేపిన ఈ జోడీని.. అయితే.. రిజ్వీని బౌల్డ్ చేసిన శాంట్నర్ ముంబైని విజయానికి చేరువ చేశాడు. అదే ఓవర్లో అశుతోష్ సైతం స్టంపౌట్‌గా వెనుదిరగగా.. ఢిల్లీ ఓటమి ఖాయమైంది. మధ్వల్ తివారీ(3)ని బుమ్రా బౌల్డ్ చేయగా.. కుల్దీప్ యాదవ్(7)ను కరన్ పెవిలియన్ పంపాడు. ముస్తాఫిజుర్‌ను బౌల్డ్ చేసిన బుమ్రా ముంబైకి 59 పరుగుల విజయాన్ని అందించాడు.

**సూర్య విధ్వంసం..**

ప్లే ఆఫ్స్ బెర్తును నిర్ణయించే కీలక పోరులో ముంబై ఇండియన్స్ హిట్టర్ సూర్యకుమార్ యాదవ్(73 నాటౌట్) సునామీలా విరుచుకుపడ్డాడు. వాంఖడే మైదానాన్ని బౌ ండరీలతో హోరెత్తించాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ(5), రియాన్ రికెల్టన్ (25) విఫలమైనా.. తిలక్ వర్మ(27)తో కలిసి జట్టును ఆదుకున్నాడు. అర్ధ శతకంతో మెరిసిన ఈ హిట్టర్.. ఢిల్లీ బౌలర్ల లయను దెబ్బతీస్తూ ఫోర్లు, సిక్సర్లతో అలరించాడు.

డెత్ ఓవర్లలో తనమార్క్ విధ్వసంక ఆటతో.. జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించాడు సూర్య. కుర్రాడు నమన్ ధిర్(24 నాటౌట్) ముకేశ్ వేసిన 19వ ఓవర్లో 27 రన్స్ రాబట్టి స్కోర్ 150 దాటించాడు. ఇక చమీర బౌలింగ్‌లో సూర్య రెండు ఫోర్లు, సిక్సర్ బాదగా ముంబై 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది.

# ఇంగ్లండ్‌కు పెద్ద షాక్..

**విండీస్ పర్యటనకు ప్రధాన పేసర్ దూరం..!**

**వెస్టిండీస్:** మరో వారంలో ఇంగ్లండ్ జట్టు వెస్టిండీస్ పర్యటనకు వెళ్లనుంది. హ్యారీ బ్రూక్ సారథ్యంలో అక్కడ వన్డే, టీ20 వన్డే సిరీస్ ఆడనుంది. ఇప్పటికే స్క్వాడ్‌ను ప్రకటించేశారు కూడా. అయితే.. విండీస్ పర్యటనకు ముందే ఇంగ్లండ్‌కు పెద్ద షాక్. ప్రధాన పేసర్ జోఫ్రా ఆర్చర్ వన్డే సిరీస్‌కు దూరం కానున్నాడు. కుడి చేతి బొటన వేలికి గాయం కారణంగా ఆర్చర్ విశ్రాంతి తీసుకోనున్నాడని బుధవారం ఆ దేశ క్రికెట్ బోర్డు వెల్లడించింది.

అయితే.. ఈ స్పీడ్‌స్టర్ స్థానంలో మరొకరిని ఈసీబీ ఇంకా ఎంపిక చేయలేదు. త్వరలోనే ఆర్చర్ బదులు స్క్వాడ్‌లోకి వచ్చే పేసర్ ఎవరో తెలియనుంది. 2109 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ హీరోగా పేరొందిన ఆర్చర్ తిరిగి 2022 నవంబర్‌లో వన్డేల్లో పునరాగమనం చేశాడు. ఆ తర్వాత రెండు మ్యాచ్‌లకే గాయం కారణంగా విశ్రాంతి తీసుకున్న అతడు.. చివరిసారిగా 2023 సెప్టెంబర్‌లో ఐర్లాండ్‌పై ఆడాడు. వెస్టిండీస్ సిరీస్‌తో మళ్లీ వన్డే అవకాశం రాగా.. గాయంతో దూరం కావాల్సి వచ్చింది.

**ఇంగ్లండ్ వన్డే స్క్వాడ్:** హ్యారీ బ్రూక్(కెప్టెన్), జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జోస్ బట్లర్, జో రూట్, జేమీ స్మిత్, బ్రైడన్ కార్సే, టామ్ హర్లే, విల్ జాక్స్, సకీబ్ మహమూద్, మాథ్యూ పాట్స్, జేమ్ ఓవర్టన్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్,



టామ్ బ్యాంటన్, ఆదిల్ రషీద్.

**12 మ్యాచుల్లో 11 వికెట్లు**

ఐపీఎల్ 18వ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అద్భుతంగా రాణించిన ఆర్చర్ 12 మ్యాచుల్లో 11 వికెట్లు తీశాడు. దాంతో, వెస్టిండీస్ పర్యటనలో ఈ స్పీడ్‌స్టర్ తమకు ప్రధాన అస్త్రంగా ఉపయోగపడుతాడని ఇంగ్లండ్ భావించింది. అయితే.. అతడు కుడిచేతి బొటన వేలి గాయంనుంచి కోలుకోలేదు. మే 4న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్ సమయంలో గాయపడిన ఆర్చర్ ఐపీఎల్ వాయిదా పడడంతో స్వదేశం వెళ్లాడు. లీగ్ పునరుద్ధరణ తర్వాతి మ్యాచ్‌లు ఆడేందుకు ఆర్చర్ తిరిగి భారత్‌కు రాలేదు. ప్రస్తుతం ఈ పేసర్ తమ బోర్డు వైద్యుల పర్యవేక్షణలో ఉంటాడని ఈసీబీ తెలిపింది. కరీబియన్ పర్యటనలో ఇంగ్లండ్ మే 29 ఆతిథ్య విండీస్‌తో తొలి వన్డే ఆడనుంది. జూన్ 1న రెండో వన్డే, జూన్ 3న మూడో వన్డే జరుగనున్నాయి. జూన్ 6న పొట్టి సిరీస్ మొదటి మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు ఆతిథ్య వెస్టిండీస్‌ను ఢీ కొట్టనుంది.

# 'ఎక్స్ ట్రా' టైమ్‌పై మండిపడిన కోల్‌కతా

**తమకు అన్యాయం జరిగిందంటూ ఈ-మెయిల్..!**

**కోల్‌కతా:** ప్లే ఆఫ్స్ నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లకు అదనపు గంట సమయం కేటాయించిన విషయం తెలిసిందే. వర్ష సూచన ఉన్నందున కీలకమైన మ్యాచ్‌లు రద్దు కాకూడదనే ఉద్దేశంతో బీసీసీఐ ఈ కొత్త నిబంధన తీసుకొచ్చింది. అయితే.. ఈ నియమంపై కోల్‌కతా నైట్ రైడర్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఐపీఎల్ పునరుద్ధరణతోనే అదనపు గంట సమయం ప్రస్తావని ఎందుకు తీసుకురాలేదు? .. మేము ప్లే ఆఫ్స్ అవకాశం కోల్పోయాం' అని తమకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించాడు కోల్‌కతా సీఈవో వెంకీ మైసూర్.

'సీజన్ మధ్యలో నిబంధనలు మార్చడం ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అనివారం కావచ్చు. కానీ, ఇలాంటి మార్పులు తీసుకోనేటప్పుడు స్థిరత్వం ఉండాలి' అని ఐపీఎల్ సీఓఓ హేమంగ్ అమిన్‌కి వెంకీ ఈమెయిల్ పంపాడు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలతో వాయిదా పడిన ఐపీఎల్ మే 17 నుంచి మొదలైంది. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ, కోల్‌కతా మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దయ్యింది. కనీసం 5 ఓవర్ల ఆట కూడా సాధ్యపడదని తేల్చడంతో.. కోల్‌కతా ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. ఇదే విషయాన్ని తన ఈమెయిల్‌లో వెంకీ ప్రస్తావించాడు.

**కనీసం 5 ఓవర్లు**

'ఐపీఎల్ పునరుద్ధరణ తర్వాత మే 17న



తొలి మ్యాచ్. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న ఆర్సీబీ, కోల్‌కతా ఇరుజట్లకు అది చాలా కీలకమైన గేమ్. మే 15న భారీ వర్షం కారణంగా చిన్నస్వామి స్టేడియం ఈతకొలనును తలపించింది. మే 17న మ్యాచ్ సమయానికి వర్షం పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది కూడా. అయినా సరే.. బీసీసీఐ.. ఐపీఎల్ సీఓఓలు మౌనంగా ఉన్నారు. అనుకున్నట్టే వాన కారణంగా మ్యాచ్ రద్దయ్యింది.

ఒకవేళ అప్పుడే మీరు అదనపు గంట సమయం ఉంటుందని చెప్పి ఉంటే కనీసం 5 ఓవర్ల ఆట అయినా సాధ్యపడేది. ఇప్పుడేమో మే 20 నుంచి ఎక్స్ ట్రా టైమ్ వర్తిస్తుందని చెబుతున్నారు. అదేదే ముందే ఆలోచించి ఉంటే బాగుండు.. మేము నష్టపోయేవాళ్లం కాదు' అని కోల్‌కతా సీఈఓ వెంకీ తమ ఆక్రోషాన్ని వెల్లగక్కాడు. కోల్‌కతా ఒక్కటే కాదు.. మరకొన్ని జట్లు కూడా సీజన్ మధ్యలో నిబంధనల మార్పును తప్పుపడుతున్నాయి. కోల్‌కతా తమ చివరి లీగ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను మే 25న ఢీకొట్టనుంది.

# తొలి రౌండ్‌లోనే సింధు ఓటమి

**ప్రణయ్, శ్రీకాంత్ ముందంజ**

**మలేషియా:** మలేషియా మాస్టర్స్‌లో భారత స్టార్ షట్లర్లు అదరగొట్టారు. ఫేవరెట్లు హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్‌లతో పాటు కరుణాకరన్, ఆయుశ్ శెట్టిలు ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో సత్తా చాటినఈ ముగ్గురు రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. అయితే.. మహిళల సింగిల్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు పోరాటం ముగిసింది. ఒలింపిక్ విజేత అయిన సింధు మొదటి రౌండ్‌లోనే నిరాశపరుస్తూ ఇంటిదారి పట్టింది.

కౌలాలంపూర్ వేదికగా జరుగుతున్న మలేషియా మాస్టర్స్‌లో ప్రణయ్ అదరగొట్టాడు. జపాన్‌కు చెందిన ఐదో సీడ్ కెంటా నిషిమోటోను చిత్తు చేశాడు. గంట 22 నిమిషాల పాటు సాగిన పోరులో భారత స్టార్ 21-17, 21-16తో గెలుపొందాడు. రెండో రౌండ్‌లో ప్రణయ్‌కు జపాన్ షట్లర్ యుషి తనక ఎదురువ్వనున్నాడు. ఇక మూడో సీడ్ చౌ థియెన్ చెన్‌తో జరిగిన మ్యాచ్‌లో కరుణాకరన్ అద్భుతంగా ఆడాడు. చైనీస్ తైపీ ఆటగాడైన చౌపై 21-13, 21-14తో జయభేరి మోగించి టోర్నీలో శుభారంభం చేశాడు. తర్వాతి రౌండ్‌లో క్రిస్టో పొపోవ్(ఫ్రాన్స్)ను కరుణాకరన్ ఢీ కొట్టనున్నాడు.



57 నిమిషాల పోరులో..

మాజీ నంబర్ 1 కిడాంబి శ్రీకాంత్ సైతం తన రాకెట్ పవర్ చూపిస్తూ ప్రత్యర్థిని మట్టికరిపించాడు. తనకంటే ఎక్కువ ర్యాంకర్ అయిన లూ గాంగ్ జూ(చైనా)ను చిత్తుగా ఓడించాడు. 57 నిమిషాల పోరులో శ్రీకాంత్ తొలి సెట్ గెలిచి జూపై పైచేయి సాధించాడు. అయితే.. ఆ తర్వాత పుంజుకున్న చైనీస్ షట్లర్ రెండో సెట్ గెలవగా. మూడో సెట్ కీలకమైంది. ఈ సెట్లో చెలరేగిన శ్రీకాంత్ 21-11తో గెలుపొంది రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు.



కిడాంబి శ్రీకాంత్ విజయానందం

ఈ సీజన్‌లో పెద్దగా ఫామ్ లేని సింధు.. మలేషియా ఓపెన్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. కానీ, చెత్త ఆటతో తొలి రౌండ్‌లోనే ఓడి టోర్నీనుంచి నిష్క్రమించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో వియత్నాం షట్లర్ గుయెన్ థుయ్ లిన్హ్ ధాటికి భారత స్టార్ చేతులెత్తేసింది. రెండో సెట్ గెలుపొందినప్పటికీ.. 11-21, 21-14, 15-21తో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీష క్రాస్టో ద్వయం రెండో రౌండ్‌లో అడుగు పెట్టింది.



# 'రుక్మిణి వసంత్'కి మరో క్రేజీ ఆఫర్ !

టాకీస్: సప్త సాగారాలుదాచే ఎల్లో సెడ్ ఎ మరియు సైడ్ బి సినిమాలతో మంచి నటిగా పేరు తెచ్చుకున్న రుక్మిణి వసంత్ ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో ఓ తుఫానులా దూసుకెళ్తుంది. ఆ సినిమాలు చూశాక రుక్మిణిని ఇండియన్ సినిమా మొత్తం తమ సినిమాల కోసం లాక్ చేసుకోవాలని చూస్తోంది. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్టీఆర్ 31 కోసం రుక్మిణి ఎంపికైందని సమాచారం. దీంతో పాటూ తమిళ సినిమాలు ఏస్, మదరాసిలో కూడా రుక్మిణి నటిస్తోంది. ఇదిలా ఉంటే రుక్మిణి ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్టులో భాగమైనట్టు తెలుస్తోంది. థగ్ లైఫ్ సినిమా తర్వాత మణిరత్నం ఓ రొమాంటిక్ ఎంటర్టైనర్ ను చేయాలని ప్లాన్ చేసుకున్నాడట. అందులో హీరోగా నవీన్ పోలిశెట్టిని అనుకుంటున్నారని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఇంకా అఫీషియల్ గా అనౌన్స్ చేయలేదు కానీ ఆ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా ఎంపికైందని వార్తలొస్తున్నాయి. ఇదే నిజమైతే ప్రశాంత్ నీల్ డ్రాగన్ మూవీ షూటింగ్ టైమ్ లో రుక్మిణి కొత్త సినిమా ఒప్పుకోకూడదనే రూల్ ను తీసేయాల్సి వస్తుంది. మణిరత్నం సీన్ లోకి వస్తే ఎవరైనా రూల్స్ ను మార్చుకోవాల్సిందేనని ఈ విషయం తెలియచేస్తుంది. ఒకవేళ నిజంగా రుక్మిణి మణిరత్నం సినిమాలో నటించడం ఓకే అయితే, నీల్ తన రూల్ బుక్ ను దీని కోసం మినహాయించాల్సి వస్తుంది. అంతేకాదు ఈ వార్త నిజమైతే రుక్మిణి ఇద్దరు మోస్ట్ పవర్‌ఫుల్ డైరెక్టర్లైన మణి రత్నం మరియు నీల్ తో ఒకేసారి సినిమా చేసే ఛాన్స్ దక్కించుకున్నదవుతుంది. అయితే ఇంకా దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. కన్నడ భాషతో కెరీర్ ను స్టార్ట్ చేసిన రుక్మిణి ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు చేసే స్థాయికి ఎదిగింది.

## హరిహర వీరమల్లు నుంచి మరో పాట

### అసుర హననం అంటూ..పవర్‌ఫుల్ సాంగ్



టాకీస్: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన లాంగ్ అవైటెడ్ చిత్రం 'హరిహర వీరమల్లు'. నిజ జీవిత యోధుడు వీరమల్లు జీవిత కథ ఆధారంగా దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, సహా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం కోసం, రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులు.. ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు విడుదలకు సిద్ధం అవుతుండగా మేకర్స్ సాలిడ్ ప్రమోషన్స్ ఆల్రెడీ స్టార్ట్ చేశారు. ఇప్పటికే రెండు పాటలు విశేషంగా ఆకట్టుకోగా తాజాగా మూడో పాట విడుదల చేశారు.అసుర హననం అంటూ సాగిన ఈ సాంగ్ అనుకున్నట్టుగానే మంచి పవర్ ఫుల్ గా ఉందని చెప్పాలి. కీరవాణి ఇచ్చిన ట్యూన్ సహా రాంబాబు గోసల సాహిత్యం స్టన్నింగ్‌గా ఉ న్నాయని చెప్పవచ్చు. మొత్తం ప్లే బ్యాక్ సింగర్స్ తోనే పాడించిన, ఈ పాట వింటుంటే ఒళ్ళు నిక్కబొడుచుకుంటుంది. అంతే కాదు ఈ లిరికల్ వీడియోలో విజువల్స్ కూడా బాగున్నాయి. పవన్ పై పలు పోరాట సన్నివేశాల దృశ్యాలు ఒక్కోక్కటి గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. మొత్తానికి రెండు సింపుల్ సాంగ్స్ తర్వాత మంచి పవర్ సాంగ్‌ని మేకర్స్ ఇపుడు విడుదల చేసారు. ఇక ఈ చిత్రం ఈ జూన్ 13న పాన్ ఇండియా భాషల్లో సినిమా విడుదల కాబోతుంది.

## మోహన్‌లాల్‌కు బర్త్‌డే కానుక కన్నప్ప నుంచి పోస్టర్ విడుదల




టాకీస్: మలయాళంలో వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లను అందుకుంటున్నారు సూపర్ స్టార్ మోహన్ లాల్. ఆయన నటిస్తున్న చిత్రాలన్నీ కూడా వరుసగా 200 కోట్ల వసూళ్లతో అదరగొడుతున్నాయి. ఇక త్వరలోనే మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' తో ఆడియన్స్ ముందుకు రానున్నారు మోహన్ లాల్. 'కన్నప్ప' నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న సంగతి తెలిసిందే. క్యారెక్టర్ పోస్టర్‌లు, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి. అయితే జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ చిత్రం నుంచి తజాగా అందరినీ ఆకట్టుకునే అప్డేట్‌ను వదిలారు. ఈ రోజు మోహన్ లాల్ పుట్టిన రోజు (మే 21) సందర్భంగా కన్నప్ప నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు.

ఈ వీడియోలో మోహన్ లాల్ స్క్రీన్ ప్రెజెన్స్, కనిపించిన తీరు అన్నీ అద్భుతంగా ఉ న్నాయి. గూస్ బంప్స్ తెప్పించేలా ఈ గ్లింప్స్‌ను కట్ చేశారు. దీని బట్టి చూస్తే, కిరాత పాత్రలో మోహన్‌లాల్ ప్రెజెన్స్, యాక్టింగ్ అందరినీ ఆకట్టుకోవడం కాయం. ఈ చిత్రంతో మళ్లీ ఆడియెన్స్‌పై తన ముద్రను వేసేలా కనిపిస్తున్నారు. దైవిక శక్తితో ముడిపడి ఉన్న కిరాత అనే పాత్రను మోహన్‌లాల్ పోషించారు. ప్రస్తుతం విష్ణు మంచు, కన్నప్ప టీం ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉండగా, ఇప్పటికే యూఎస్ టూర్‌ను పూర్తి చేశారు.

## జూన్ 5న కమలహాసన్ థగ్‌లైఫ్ విడుదల



టాకీస్: కమల్ హాసన్ నటించిన తాజా చిత్రం 'థగ్ లైఫ్'. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం కాంపౌండ్ నుంచి వస్తోన్న ఈ మూవీలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఐశ్వర్యలక్ష్మి, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కమల్ హీరో మాత్రమే కాదు నిర్మాత కూడా. ప్రొడక్షన్ హౌస్ రాజ్ కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్, దర్శకుడు మణిరత్నానికి చెందిన మద్రాస్ టాకీస్, ఉదయనిధి స్టాలిన్‌కు రెడ్ జెయింట్ ఫిలింస్ మీద సినిమా రూపొందింది. ఇక.. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన రాగా. ఈ చిత్రం జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. అయితే ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ డేట్ గురించి కమల్ హాసన్ క్లారిటీ ఇచ్చారు. రీసెంట్ గా ఓ మీడియాతో ముచ్చటించగా.. ఓటీటీలోకి ఎప్పుడు వస్తుంది? అంటే.. 'ఆగస్టు వరకు వెయిట్ చేయాలి. థియేటర్లలో విడుదలైన ఎనిమిది వారాల తర్వాత మాత్రమే మా సినిమా ఓటీటీ లోకి వస్తుంది' అని కమల్ హాసన్ స్పష్టం చేశారు. కాగా ఈ 'థగ్ లైఫ్' ఓటీటీ హక్కులను ఇంటర్నేషనల్ ప్లాట్‌ఫార్మ్ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా. తమిళం తో పాటు తెలుగు, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నారట.

## అనుష్క ఘాటీకి వరుస అవాంతరాలు

### విడుదల ప్లాన్ జూలైకి వాయిదా




టాకీస్: టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ మూవీలో తమిళ హీరో విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తుండగా. ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఇక ఇప్పటి వరకు అనుష్కను జేజమ్మ, దేవసేన వంటి పవర్ ఫుల్ రోల్స్ చూసినప్పటికి.. మొట్టమెదటి సారిగా ఆమెను వయలెంట్ రోల్‌లో చూపించే క్రెడిట్ క్రిష్ జాగర్లమూడికి దక్కింది. దీంతో అనుష్కని తెరపై ఎప్పుడు చూస్తామా.. అని అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్ పై..వార్తలు వినపడుతున్నాయి. మొదట ఏప్రిల్ 18న ఈ మూవీ రిలీజ్ చేయాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేసినప్పటికి, కొన్ని అనివార్య కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. ఇప్పుడు ఈ సినిమాను జూలై రెండో వారంలో తీసుకు రావాలని ప్లాన్ చేస్తున్నారట. కానీ జూన్‌లో రిలీజ్ డేట్స్ ఖాళీ లేవు. మొదటి వారం కమల్ హాసన్ 'థగ్ లైఫ్', రెండో వారం పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు', మూడో వారం ధనుష్ 'కుబేర', నాలుగో వారం విష్ణు మంచు 'కన్నప్ప' వంటి వరుస పాన్ ఇండియా సినిమాలు లైన్ లో ఉన్నాయి. జూలై మొదటి వారంలో విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' రిలీజ్ కు రెడీ అయింది. అంటే జూలై రెండవ వరం స్లాట్ ఖాళీగా ఉ ందన్నమాట. అందుకే అప్పుడు విడుదల చేయాలని ప్లాన్ చేశారట. మరి జూలై రెండో వారంలో అయిన 'ఘాటీ' కి సోలో రిలీజ్ దక్కే అవకాశం ఉందంటారా..?



## అవకాశాలు రాకుండా తొక్కేశారు

### దర్శకుడు త్రివిక్రమ్‌పై పూనమ్ విమర్శలు

టాకీస్: ఒకప్పటి పాపులర్ నటి పూనమ్ కౌర్ ఇటీవల వివాదాలతో వార్తలలో నిలుస్తుండడం మనం చూస్తూ ఉన్నాం. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్‌లని టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో ఆసక్తికర కామెంట్స్ చేస్తూ ఉంటుంది. గతంలో త్రివిక్రమ్‌పై పూనమ్ కౌర్ సంచలన కామెంట్స్ చేయగా, ఇప్పుడు దానిపై మరోసారి స్పందించి వార్తలలో నిలిచింది .నేను గతంలో చెప్పాను, ఇప్పుడు కూడా చెబుతున్నాను. మెయిల్ ద్వారా కంప్లైంట్ చేశాను. ఝాన్సీ గారితో మాట్లాడాను, కాని తర్వాత ఆమెని కలవలేకపోయిను. ఆమె బిజీగా ఉన్నారని, డిస్టబ్ర్ చేయొద్దని చెప్పారు. అందుకే కలవలేకపోయాను. నేను త్రివిక్రమ్ శ్రీనివాస్ మీద కంప్లైంట్ చేశాను. రాజకీయ అండదండలతో ఎవరైతే తప్పించుకుంటున్నారో అతడి మీద ఫిర్యాదు చేశాను.. మెయిల్ చేసినట్టుగానే ఉమెన్ టీంతో నేను మాట్లాడతాను.. థాంక్యూ అని పూనమ్ పోస్ట్ వేసింది. తన వద్ద ఆధారాలు ఉన్నాయంటూ ఝాన్సీతో చాట్ చేసిన స్క్రీన్ షాట్లను కూడా ఆమె బయటపెట్టారు. ఈ క్రమంలో మరోసారి వీరి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబుని పూనమ్ కలవగా, అందుకు సంబంధించిన ఫొటో నెట్టింట వైరల్ అయింది. ఆ ఫొటో చూసి త్రివిక్రమ్‌తో సమస్య సమసిపోయిందని , అందుకే కూటమి ప్రభుత్వంలో పవన్ ఉన్నా కూడా చంద్రబాబుని కలిసింది అని అంతా అనుకున్నారు. కాని ఇప్పుడు ఆమె పోస్ట్‌లు చర్చనీయాంశంగా మారాయి. మలయాళ ఇండస్ట్రీ, మీటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్న టైంలోనే పూనమ్ కౌర్ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. సినిమా అవకాశాల పేరుతో తనను ఛీట్ చేశారని.. ఇండస్ట్రీలో ఎదగకుండా తొక్కేశారని పూనమ్ పెద్ద ఎత్తునే విమర్శలు చేసింది. మాలో కూడా ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. అయితే దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజకీయంగా తనని ఇబ్బందికి గురి చేశారని, అందుకే అప్పట్లో వదిలేశానని చెప్పింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.